వైఎస్ఆర్
కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 24 జూలై 2026

## బాలికల విద్య భవిష్యత్తుకు పునాది



దువ్వూరు, జూలై 23, ప్రభాతవార్త:

బాలికల విద్య భవిష్యత్తుకు పునాది అని సూపర్ వైజర్ సౌజన్య పేర్కొన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని చల్లబసాయి పల్లె గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో బేటి బచావోబేటి పడావో కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ సౌజన్య మాట్లాడుతూ విద్యార్థినిలు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరుకోవాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. బాలికల విద్య ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వారు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరాలని, విద్యార్థులకు, బాలలకు సంబంధించి నటువంటి చట్టాలు మరియు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 గురించి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా మహిళలకు పిల్లలకు అందుతున్నటువంటి సేవలు గురించి తెలియజేశారు. చైల్డ్ హెల్ప్ లైన్, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 27న నియోజకవర్గంలో ఇంటింటి సంక్షేమ సందేశం

**క్యాడర్‌కు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి దిశానిర్దేశం**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పీలేరు జూలై 23 ప్రభాతవార్త:

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, జరిగిన అభివృద్ధి,ని ప్రతి ఇంటికి చేరవే యాలని పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈనెల 27వ తేదీ నుండి పీలేరు నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం చేపట్టాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కలికిరి మండలం నగిరిపల్లి లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు, యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్చార్జులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ప్రతి పట్టణం, గ్రామంలోని ప్రతి యూనిట్‌లో 30 ఇళ్లు చొప్పున సందర్శించాలి. ప్రతి ఇంట్లో 3 నిమిషాల పాటు ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పీలేరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివ రించాలి. కరపత్రాలు అందజేయాలని అనంతరం వివరాలను మై టీడీపీ యాప్‌లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పీలేరు నియోజకవర్గ అబ్జర్వర్ సుబ్బయ్య, నియోజవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, పలువురు, అనుబంధ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# జలధారతో కనగిరి పెద్ద చెరువుకు జలకల

**36 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యానికి గాను 27 ఎంసీఎఫ్‌టీ నీటి నిల్వ - 175 ఎకరాలకు సాగునీటి ప్రయోజనం**

**బ్రీచ్ అయిన దండువాంచెరువు పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



పీలేరు జూలై 23 ప్రభాతవార్త:

జలధార కార్యక్రమం ద్వారా చెరువులు, క్యాస్కేడ్ల అభివృద్ధితో నీటి నిల్వ సామర్థం పెరిగిందని, నీరు సమర్థవంత వినియోగానికి ప్రణాళికబద్ధంగా చర్య లు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలికిరి మండలంలోని కనగిరి పెద్ద చెరువును స్థానిక ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులతో కలిసి కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు నీటి నిల్వ స్థాయి, క్యాస్కేడ్ అభివృద్ధి, చెరువు సామర్థం, ఆయకట్టు తదితర వివరాలను వారు సంబంధిత ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కనగిరి పెద్ద చెరువు మొత్తం నీటి నిల్వ సామర్థం 36 ఎంసీఎఫ్‌టీ కాగా, ప్రస్తుతం 27 ఎంసీఎఫ్‌టీ నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు వివరించారు. ఈ చెరువు ద్వారా సుమారు 175 ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.జలధార కార్యక్రమంలో భాగంగా కనగిరి క్యాస్కేడ్ పరిధిలోని చెరువుల అభివృద్ధి, నీటి ప్రవాహ మార్గాల పునరుద్ధరణ తదితర పనులు చేపట్టడం వల్ల గత ఏడాదితో పోలిస్తే క్యాస్కేడ్ అభివృద్ధి గణనీయంగా పెరిగిందని అధికారులు వివరించారు. క్యాస్కేడ్ పరిధిలోని ఏడు చెరువుల్లో ప్రస్తుతం సుమారు 50 శాతం నీటి నిల్వ ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా కనగిరి పెద్ద చెరువులో ఇటీవల సుమారు రూ.5 లక్షల విలువైన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు చేపట్టినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. చెరువు అభివృద్ధి, నీటి నిల్వ పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు.

**బ్రీచ్ పనులను త్వరగా పూర్తి చేయాలి**

అనంతరం కలికిరి మండలంలోని దండువాంచెరువును కూడా కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలించారు. చెరువు బ్రీచ్‌కు సంబంధించిన మరమ్మతు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో, వర్షాకాలం ప్రారంభమైనందున పను లను వేగవంతం చేసి వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదే శించారు.వర్షాలు కురిసే సమయంలో చెరువుకు మరింత నీరు చేరే అవకాశం ఉన్నందున బ్రీచ్ పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకుండా సాధ్య మైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. చెరువుల భద్రత, నీటి నిల్వ సామర్థం, సాగునీటి వినియోగం విషయంలో అధికారులు నిరంతరం పర్యవే క్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత కలికిరి ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు, సంబంధితఅధికారులు పాల్గొన్నారు..

## కేంద్ర మంత్రి విషయంలో బిజెపి మొండి వైఖరి

**ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి**



వేంపల్లె, జూలై 23, ప్రభాతవార్త,

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో బిజెపి మొండి వైఖరి వహిస్తోం దని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి అన్నారు. గురు వారం విలేక రులతో ఆయన మాట్లాడుతూ 2021 లో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి బాధ్యతలు చేప ట్టినప్పటి నుంచి పలు జాతీయస్థాయి పోటీ పరిక్షల ప్రశ్నపత్రాలు లీకేజీ, పరిక్షల రద్దు, వాయిదాలు పడ్డా యన్నారు. అలాగే నీట్ 2026 ప్రతిష్టాత్మక ప్రశ్నాపత్రం లీకేజీ, పరిక్ష రద్దు కావడం, తిరిగి నిర్వహిం చడం జరిగిందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా అనేక ప్రతిష్టాత్మకమైన పరిక్షల్లో అవకత వకలు చోటు చేసుకున్నాయని, దీనిపై నైతిక బాధ్యత వహిస్తూ స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రధాని మోడీ, ధర్మేంద్ర ప్రధాన్‌ని మంత్రి వర్గం నుంచి తప్పించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఆయా మంత్రిత్వ శాఖల్లో జరిగిన ప్రమాదాలు, అవినీతి ఆరోపణలపై అప్పటి కేంద్ర మంత్రులు ప్రత్యక్షంగా తమ బాధ్యత లేనప్పటికీ బాధ్యత వహిస్తూ అనేక మంది రాజీనామా చేశారని గుర్తు చేశారు. అలాగే బిజెపి ఏపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవన్ నేతృత్వంలో విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్నభవన్ పై బిజెపి శ్రేణులు దాడులు చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. తప్పు చేసింది బిజెపి.. దీనిని సరిదిద్దుకోవాల్సింది పోయి కాంగ్రెస్ కార్యాలయంపై దాడి చేయడం ఏమిటి అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, ధృవకుమార్ రెడ్డి, రామకృష్ణ, రామాంజనేయ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రారెడ్డి, వెంకటేష్, బద్రీ, రాఘవయ్య, వేమారాజా పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఆస్తుల పరిరక్షణకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు

**మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్**



ప్రొద్దుటూరు, జూలై 23, ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఆస్తులను పరిరక్షించేందుకు పట్టణ ప్రణాళిక మరియు ఇంజనీరింగ్ అధికారులతో త్వరలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఆస్తులు అన్యాక్రాంతం అయితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పట్టణ పరిధిలో ఉన్న చాలా మున్సిపాలిటీ స్థలాలకు రక్షణ కవచం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని, స్థలాలకు ఫెన్సింగ్ ప్రొటెక్షన్ లేకపోతే కోట్లాది రూపాయిలు విలువ చేసే మున్సిపాలిటీ ఆస్తుల ఎంక్రోచ్మెంట్ జరగవచ్చని దశలు వారీగా అన్ని స్థలాలకు రక్షణ కవచం ఏర్పాటు చేస్తామని శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అయితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని అన్నారు. ఈ విషయంలో ఇప్పటికే టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారిచేశామని, త్వరలో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షా నిర్వహించి మున్సిపాలిటీ స్థలాలు రక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు, టాస్క్ ఫోర్స్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని కమీషనర్ శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు.

## డైట్‌లో తొలి విడత ప్రవేశాలు జూలై 24 నుంచి ప్రారంభం

**డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి**



రాయచోటి, జూలై 22, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టద్వారా ప్రభుత్వ మరియు ప్రైవేట్ డి.ఎల్.ఎడ్. కళాశాలల్లో ప్రవేశాలకు సీట్లు కేటాయించబడిన అభ్యర్థులకు జూలై 24 నుండి తొలి విడత ప్రవేశ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు రాయచోటి ప్రభుత్వ డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. గురువారం డైట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెబ్ ఆధారిత ఆప్షన్ల నమోదు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ నుండి అడ్మిషన్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకుని, 24072026 నుండి 29 072026 వరకు తమకు కేటాయించబడిన ప్రభుత్వ డైట్ కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకోవాలని సూచించారు.నిర్ణీత గడువులోగా ప్రవేశం పొందని అభ్యర్థుల సీట్లు నిబంధనల ప్రకారం తదుపరి విడత కౌన్సెలింగ్‌కు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో డైట్ అధ్యాపకులు మార్ల ఓబుల్ రెడ్డి, గిరిబాబు యాదవ్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## వీరబల్లె మండలంలో అన్ని గ్రామాలకు రోడ్లమడుగు నీరు

**చమర్తి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు**



పార్టీలో చేరిన నాయకులతో జగన్మోహన్ రాజు

రాజంపేట, జూలై 23 ప్రభాతవార్త.

తెదేపా హయాంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఆకర్షితులై వైసీపీ నుంచి పార్టీలో చేరుతున్నారని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జి జగన్మోహన్ రాజు అన్నారు.గురువారం వీరబల్లి మండలం, గుర్రప్ప గారి పల్లె,తొగట పల్లెలో వైకాపాకు చెందిన 25 కుటుంబాలను సాదరంగా జగన్ మోహన్ రాజు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు రోళ్ళమడుగు ద్వారా త్రాగునీరు అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసినట్లు జగన్ మోహన్ రాజు తెలియజేశారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని, అన్ని గ్రామాలకు త్రాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతేకాకుండా జల్ జీవన్ మిషన్ కింద 27 కోట్లు వచ్చాయని వాటి పనులను కూడా త్వరలోనే చేపడతామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో సీఎంకు సాటి ఎవరూ లేరన్నారు.ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ఈవీఎం గోడౌన్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



కడప, జూలై 23, ప్రభాతవార్త:

గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ భవన సముదాయంలోని ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఎన్నికల కమీషన్ నియమ నిబంధనల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా.. ఈవీఎంలు, వివి ప్యాడ్స్ భద్రపరిచిన గోడౌన్ల పరిస్థితిని జిల్లా కలెక్టర్ పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో గంగయ్య, హెచ్ సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బద్వేలులో రెండు రోజులు జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి మకాం

**వాహనాలు తనిఖీచేసిన అధికారి**

**యాప్ పై యజమానులకు అవగాహన కల్పించిన డీసీసీ**



బద్వేలు, జూలై 23 ప్రభాతవార్త:

జిల్లా రవాణాధికారి వీరాజు రెండు రోజులు బద్వేలులో మకాం వేశారు. బుదవారం సాయం త్రం బద్వేలుకు వచ్చిన ఆయన ఇక్కడే బసచేసి గురువారం ఉదయాన్నే వాహనాలను తనిఖీ చేపట్టారు. ఓవర్లోడుతో వెళ్తున్న వాహనాలను, పత్రాలు లేని వాహనాలను తనికీచేసినట్లు సమాచారం. అనంతరం గురువారం ఎంవీఐ కార్యాల యంలో లారీ యజమానులు, ట్రాన్స్పోర్టు ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఏపీ ట్రాన్స్పోర్టు కనెక్ట్ మొబైల్ యాప్పై ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా వాహనాల యజ మానులతో పాటు అద్దెకు తీసుకునేవారికి ప్రయోజనం ఉంటుందన్నారు. వాహనాలు అద్దెకు కావాలంటే ఈ యాప్ ఉపయోగించుకోవచ్చన్నారు. భవిష్యత్తులో రిజిస్టర్ సేవలు వేగవంతమై ధృవీకరణ, తక్కువ పేపర్ వర్క్ సులభంగా సమాచారం చేరవేత మరింత విస్తృత వ్యాపారా అవకాశాలు పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు. అనుకోకుండా జిల్లా ట్రాన్స్పోర్టు అధికారి బద్వేలుకు రావడంతో స్థానిక ఎంవీఐ ఉలిక్కిపడ్డారు. అలాగే తనిఖీలు చేపట్టడంపై కూడా స్థానిక అధికారులు ఖంగుతిన్నారు. జిల్లా అధికారి బద్వేలులో తనిఖీలు చేపట్టడం జరిగింది. స్థానిక అధికారులు సిబ్బంది వారి రాకతో అవాక్కయ్యారు.

## రాష్ట్ర హాకీలో పులివెందుల జోరు

4వ పేజీలో



## అదనపు తరగతి గదులు నిర్మాణానికి చర్యలు



4వ పేజీలో

## మెగా పీటీఎం-4.0కు అన్నమయ్య జిల్లాలో సర్వం సిద్ధం

**1,803 పాఠశాలల్లో శుక్రవారం నిర్వహణ..**
**విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధుల విడుదల**
**తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలి**
**డీఈఓ డాక్టర్ కే. సుబ్రహ్మణ్యం**



మదనపల్లె క్రైం, జూలై 23 ప్రభాతవార్త.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ (పీటీఎం)-4.0 కార్యక్రమాన్ని శుక్రవారం అన్నమయ్య జిల్లాలోని 1,803 ప్రభుత్వ పాఠశాలల్లో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) డాక్టర్ కే. సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ అనురాధ తెలిపారు. గురువారం మదనపల్లెలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. విద్యార్థుల నమోదు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు ప్రత్యేక నిధులు విడుదల చేసిందని తెలిపారు. ఈ నిధులను బ్యానర్లు, తోరణాలు, పాఠశాల ప్రాంగణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడం తదితర ఏర్పాట్ల కోసం వినియోగించాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని హెడ్‌మాస్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి తల్లిదండ్రి మొబైల్‌లో లీప్ యాప్ డౌన్‌లోడ్ చేయించి, దాని వినియోగంపై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠ్యపుస్తకాలు, అధ్యయన వీడియోలు, ఇతర విద్యా సమాచారం ఈ యాప్ ద్వారా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యాస పురోగతిని తల్లిదండ్రులకు వివరించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సమావేశానికి హాజరయ్యే తల్లిదండ్రులు, ఇతర పాల్గొనేవారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## వనిపెంట సమీపంలో యువకుడు దారుణ హత్య

**తలపై బండరాళ్లతో కొట్టి హత్య చేసిన దుండగులు**



మైదుకూరు, జూలై 23, ప్రభాతవార్త:

వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు మండలం వనిపెంట జగనన్న కాలనీ సమీపంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన స్థాని కంగా కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం, హత్యకు గురైన యువకుడు బోన్ చేనుపల్లె గ్రామానికి చెందిన యన్నం వెంకటేశ్వర్లు అలియాస్ ఏసుబాబు (20)గా గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై దాడి చేసి, తలపై బండరాళ్లతో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రాథమికంగా పోలీసులు గుర్తిం చారు. సమాచారం అందుకున్న మైదుకూరు పోలీ సులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తర లించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిం చారు.హత్యకు గల కారణాలు ఏమిటి, ఈ ఘటన వెనుక ఎవరున్నారు అనే కోణాల్లో పోలీసులు విచా రణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జంతర్ మంతర్ వద్ద నిరసనల పేరుతో హైడ్రామా

**దేశాన్ని అస్థిరపరిచే కుట్రలను బీజేపీ అడ్డుకుంటుంది**
**లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవు**
**కడప జిల్లా గ్రంథాలయ చైర్మన్ భాను ప్రకాష్**




పులివెందుల జూలై 23 ప్రభాతవార్త :

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కొంతకాలంగా కొనసాగుతున్న నిరసనల తీరుపై కడప జిల్లా గ్రంథాలయ చైర్మన్, బీజేపీ నాయకుడు భాను ప్రకాష్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పట్టణంలోని వైయస్ ఆర్ ప్రెస్ క్లబ్ నందు శనివారం బీజేపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం లో ప్రపంచవ్యాప్తంగా భారతదేశ కీర్తిని నింపారు అని ఒక ఆర్థిక శక్తి గా ప్రపంచ దేశాలు మన దేశానికి గౌరవం ఇస్తున్నాయి అని అన్నారు. బీజేపీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రతిపక్ష ఇండియా కూటమి కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీ అంశాన్ని అడ్డుపెట్టుకుని దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. విద్యార్థుల ముసుగులో కొందరితో ఇండియా కూటమి నిరసనలు చేయిస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అయితే ఇలాంటి కుట్రలను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించదని స్పష్టం చేశారు.ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీలు తమ గత పాలనను ఒకసారి గుర్తు చేసుకోవాలని, తమ పాలనలో కుంభకోణాలు తప్ప ప్రజలకు అందించిన పాలన ఏమీ లేదని భాను ప్రకాష్ విమర్శించారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో ఎవరు తప్పు చేసినా వారికి శిక్ష తప్పదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారని తెలిపారు. ఒక వ్యక్తి చేసిన తప్పును మొత్తం సమాజానికి ఆపాదించడం సరికాదన్నారు.భవిష్యత్తులో పేపర్ లీకేజీలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని భాను ప్రకాష్ తెలిపారు. దేశాన్ని అస్థిరపరిచే ప్రతి ప్రయత్నాన్ని ప్రజలు అడ్డుకుని దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.నిరసనలను కవరేజ్ చేసేందుకు వెళ్లిన మహిళా జర్నలిస్టుపై కొందరు అసభ్యంగా ప్రవర్తించారని ఆయన ఆరోపించారు. ఇలాంటి ప్రవర్తనకు పాల్పడే వారు నిజంగా విద్యార్థు లేనా అని ప్రశ్నించారు. నిరసనల్లో కొందరి ప్రవర్తన, నినాదాలు చూస్తే దీని వెనుక రాజకీయ ప్రేరేపిత శక్తులు ఉన్నాయనే అనుమానం కలుగుతోందన్నారు.సోనమ్ వాంగ్‌చుక్‌పై కూడా భాను ప్రకాష్ విమర్శలు చేశారు. ఆయన ప్రతిపక్ష కూటమి చేతిలో కీలుబొమ్మగా వ్యవహరిస్తు న్నారని, దేశ వ్యతిరేక శక్తులకు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి  ్మ, బీజేవైఎం ఉపాధ్యక్షుడు వాజ్‌పాయి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నవీన్ కుమార్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ సృష్టికి మూలం ప్రగతికి చిహ్నం

### వైద్యురాలు శ్రీగిరీష


అవగాహన కార్యక్రమం లో మాట్లాడుతున్న వైద్యురాలు

పీలేరు జూలై 23 ప్రభాతవార్త: సమాజ శ్రేయస్సు దృశ్య ఏ బిడ్డయిన ఒకటే అని తెలుసుకుని "ఆడశిశువును రక్షిద్దాం, మానవ జాతి మునుగడను కాపాడుదాం." అని తలుపుల పి హెచ్ సి ప్రదాన వైద్యాధికారులు శ్రీగిరీష అన్నారు. జాండ్ల గ్రామంలో గురు వారం లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అంశంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరీష్ మాట్లాడుతూ కొందరు ఆడబిడ్డ వద్దనుకునేవారు గర్భధారణ సమయంలో స్కానింగ్ సెంటర్లకు వెళ్లి లింగ నిర్ధారణ చేసుకొని తద్వారా ఆడపిల్ల అని తెలుసు వెంటనే గర్భస్రావము చేసుకొనుట చట్ట రీత్యా నేరమని ఇలా చేయించుకొనుట వలన ఆడపిల్లల సంఖ్య తగ్గి, ఆందోళన కలిగించే అంశం అని గిరీష మహిళలకు హితవు పలికారు. ఈ విధంగా కొనసాగితే సమాజంలో అసమానతలు ఏర్పడి సమాజము ఆడ శిశువులను కోల్పోయి సమాజ అభివృద్ధి కుంటుపడడమే కాకుండా సమాజం అమ్మలేని అనాధ అవుతుందని, కావున బ్రూన హత్యలు నిర్మూలిద్దాం, మానవజాతి మనుగడకు వాగ్దానం చేద్దా,మని డా: శ్రీగిరీష మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఓ కొండయ్య, ఎంపిహెచ్ఇఓ శ్రీనివాసులు, పర్యవేక్షకులు నాగమ్మ, ఏఎన్ఎం కృష్ణమ్మ సిహెచ్ఓ లావణ్య, సుధా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్షయ నిర్మూలన ధ్యేయం

### డాక్టర్ ప్రదీప్, డి.హెచ్.ఈ.ఓ. మహమ్మద్ రఫీ



పీలేరు జూలై 23 ప్రభాతవార్త: అన్నమయ్య జిల్లాలోని సోమలలో టీబి ఓడిపోతుంది దేశం గెలుస్తుంది అని సోమల పి. హెచ్. సి. వైద్యులు డాక్టర్ ప్రదీప్,డాక్టర్ రాజకుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యు కేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. టి.బి. ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం లోని పి. హెచ్. సి.లో డి.ఎమ్.హెచ్.ఓ ఆదేశాల మేరకు, జిల్లా టి. బి. అధికారి పర్యవేక్షణలో సీనియర్ సిటిజెన్లకు టి. బి. వ్యాధి పైన అవగాహనా సదస్సు మరియు స్క్రీనింగ్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుచు క్షయ వ్యాధి టి. బి. వ్యాధి గ్రస్థులు ప్రపంచంలో ఉన్న దేశాలాన్నిటిలో కన్నా భారతదేశం లోనే ఎక్కువ మంది ఉన్నారని అన్నారు. టి.బి. ముక్త్ పంచాయతీ లక్ష్య సాధనలో భాగంగా 60సంవత్సరాల పైబడిన వృద్ధులు, షుగర్ ఉన్నవారు, పొగ త్రాగువారు, ఆల్కహాల్ తాగువారు, బి.ఎమ్.ఐ. 18కంటే తక్కువ ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. కిడ్నీ సమస్యలు ఉన్నవారు, మంచానికి పరిమితం ఐన రోగులు, గర్భవతులు ఈ కేటగిరి వారందరు గల్ల, ఎక్సరే పరీక్షలు చేసుకుని వ్యాధి నిర్ధారణ ఐతే ఆరు నెలలు మాత్రలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుంది. మరియు ప్రధానమంత్రి పోషన్ యోజన పథకం కింద మంచి పౌష్టికహారం తినడానికి నెలకు రు.1000లువారి ఖాతాలో జమ చేస్తారణి తెలిపారు. సై. టీబి పరీక్షలు క్షయ రోగి భందువులు ఏ. ఎన్. ఎమ్ దగ్గర చేయించుకుని ఒకవేళ పాజిటివ్ వస్తే టి.బి రాకుండా భవిష్యత్‌లో మూడు నెలలు మాత్రలు తినాలని అన్నారు. అనంతరం ప్లేకార్డ్స్ ప్రదర్శన చేయడం జరిగింది. అనంతరం ప్రజలచే టి.బి. ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో వైద్యులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ రాజకుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, సి.హెచ్.ఓ. అమరణాథ, పర్యవేక్షకులు వసంత, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎల్. టి. తదితరులు పాల్గొన్నారు.

## వీబీరామ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



వాల్మీకిపురం జూలై 23 ప్రభాతవార్త: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న వీబీరామ్ పథకం ద్వారా వంద రోజుల పనులను 125 రోజులకు పెంచడం జరిగిందని,వీటిని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకుని ఉపాధిని పొందాలని పీడీ వెంకటరత్నం అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తిలోని మ్రరికుంట పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. వీబీరామ్ ద్వారా జూలై 1వ తేది నుంచి పథకంలో మార్పులు అమలౌతున్నాయని వీటిని కూలీలు, రైతులు గమనిం చాల్సి న అవసరం ఉందన్నారు. కూలీలకు సైతం సకాలంలో కూలీలు చెల్లిం చేలా కొత్త మార్పులను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. అనంతరం మండ లంలోని దండువారిపల్లెలో జరుగుతున్న కాలువపూడిక తీతపనులు, పత్తేపు రంలో రైతులు ఈ పథకం ద్వారా సాగుచేసిన మామిడి, టెంకాయ తదితర మొక్కల పెంపకాన్ని పీడీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మురళి, ఉపాధిసిబ్బంది, కూలీలు, రైతులు పాల్గొన్నారు.

## 31న కనీస వేతనాలకై అంగన్వాడీలధర్నా జయప్రదం చేయండి

### ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఇంచార్జి డి. భాగ్యలక్ష్మి



లక్కిరెడ్డిపల్లి, జూలై 23, ప్రభాతవార్త : ఈ నెల 31న రాష్ట్ర వ్యాప్తంగా కనీస వేతనాల కోసం చేపట్టిన స్కీమ్ వర్కర్స్ ధర్నా లో అంగన్వాడీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. గురువారం స్థానిక బాలసదనం ఆవరణలో అధ్యక్షురాలు సుకుమారి అధ్యక్షతన జరిగిన ప్రాజెక్టు సమావేశం లో వారు మట్లాడుతూ అంగన్వాడీలకు గత 8 సంవత్సరాలనుండి వేతనాలు పెంచకుండా పనిభారం పెంచి వేదనకు గురి చేస్తున్నదని తెలిపారు. నవ చేతన యాప్ రద్దు చేయాలని పెండింగ్ జీతాలు ఇవ్వాలని గ్రాట్యూటీ అమలు చేయాలని జరిగే ధర్నాలో అందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.31న ధర్నా పోస్టర్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులుతో కలసి గోడ పత్రాలు ఆవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో ఓబుళమ్మ ప్రభావతి లక్ష్మి ప్రసన్న శారద శిరీష శోభారాణి అనీష సావిత్రి రుక్మిణి మోహన కుమారి ఇరగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సి కమిటీని వేసి 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి



లక్కిరెడ్డిపల్లి, జులై 23, ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సి కమిటీని వేసి 30 శాతం ఐ ఆర్ ను వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. గురువారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు కేవీ సుబ్బారాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఎం నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సినటువంటి పెండింగ్ డీఏలను మరియు నూతన పిఆర్సి కమిటీని వేసి 30 శాతం ఐ ఆర్ ను వెంటనే ప్రకటించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా మీడియా ఇంచార్జ్ కె వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలరాజు లు మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు ఓపిఎస్ ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా మిగిలిన సిపిఎస్ ఉద్యోగులకు కూడా ఓ పి ఎస్ ను అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కే. నరసింహులు, మండల కార్యదర్శి సాయిచరణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబరు 396ను వెంటనే ఉపసంహరించుకోవాలి

పీలేరు జూలై 23 ప్రభాతవార్త: ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 3962 వెంటనే ఉపసంహరించుకోవాలని దస్తావేజులేఖరులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సబ్డిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నాలుగో రోజు రిలేనిరాహార దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో ఫ్రంట్ ఆఫీసులు ఏర్పాటు చేసి వాటిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం వల్ల దస్తావేజులేఖర్లు, వారి సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు జీవనోపాధి కోల్పోతారన్నారు. తద్వారా వారి కుటుంబ సభ్యులు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. చట్టబద్ధత లేని ప్రయివేట్ సంస్థలతో ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం విజ్ఞతతో ఆలోచించి పబ్లిక్ ప్రయివేట్ భాగస్వామ్య విధానాన్ని విరమించుకోవాలని కోరారు.

## భూమన కుటుంబ ఆస్తుల విధ్వంసం కక్షసాధింపు చర్యే : మద్దిరాళ్ళ మల్లికార్జున



పీలేరు జూలై 23 ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి కుటుంబానికి చెందిన భూములను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని చేపట్టిన చర్యలను పీలేరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమాచార హక్కు చట్టం అధ్యక్షులు మద్దిరాళ్ళ మల్లికార్జున తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్షతో ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి ప్రతిపక్ష నాయకులను వేధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. భూమన కరుణాకర రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే ఆయన కుటుంబ ఆస్తులను లక్ష్యంగా చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. చట్టాన్ని అమలు చేయాల్సి న అధికారులు అధికార పార్టీ రాజకీయ ప్రతీకారానికి సాధనాలుగా మారడం ఆందోళనకరమని మద్దిరాళ్ళ మల్లికార్జున పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాల పేరుతో వ్యక్తిగత ఆస్తులపై దాడులు చేయడం ప్రజాస్వామ్యంలో ప్రమాదకర ధోరణి అని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సి న బాధ్యత ప్రభుత్వంపై ఉందని, రాజకీయ వేధింపులు, కక్షపూరిత చర్యలను వెంటనే నిలిపివేయాలని పీలేరు నియోజకవర్గ సమాచార హక్కు చట్టం అధ్యక్షులు మద్దిరాళ్ళ మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నేడు రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

పీలేరు, జూలై 23 ప్రభాతవార్త; నీట్ పరీక్ష పేపర్ లీకేజ్కు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, విద్యార్థులకు న్యాయం చేయాలనే డిమాండ్తో శుక్రవారం నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ను విజయవంతం చేయాలని ఎన్ఎస్ఐయూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృతేజ.. జిల్లా అధ్యక్షుడు సాయిసంపత్ కోరారు. అఖిలపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు చేస్తున్న విద్యాసంస్థల బంద్కు అన్ని ప్రభుత్వ. ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలు. విశ్వవిద్యాలయాల యాజమాన్యం సహకరించాలని కోరారు.

## తల్లికి వందనం పథకం పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా : గండికోట సుధాకర్




రాయచోటి, జులై 23, ప్రభాతవార్త: రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక చొరవతో తల్లికి వందనం పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా చేరుతోందని రాయచోటి టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో ఖితల్లికి వందనంఖి పథకం అత్యంత కీలకమైనదని ఆయన అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమ చేస్తూ కుటుంబాలకు అండగా నిలుస్తోంద న్నారు.ఈ పథకం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై విద్యా భారం తగ్గడమే కాకుండా, విద్యార్థులు నిరాటంకంగా తమ చదువును కొనసాగించే అవకాశం కలిగిందని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేస్తోందని, ప్రతి అర్హ కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గండ ికోట సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఆకుల మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## సహజంగా మెరవండి!



పండుగల వేళ, పెళ్లి సమయాల్లో అమ్మాయిలకు మోము కాంతులీనాలంటే.. ముఖానికి మేకప్ తప్పనిసరి. అలాగని అందరికీ ఒకే తరహా నప్పదు. ముఖ్యంగా కొట్టొచ్చినట్లు కనబడే రంగులు, జిగేల్మనిపించేలా ఐడ్స్, బోల్డ్‌గా తీర్చిదిద్దిన పెదాలను కొందరు మెచ్చుకున్నారు. ఇలాంటివారికి కనీస మేకప్ చక్కని ఎంపిక. అందంగా మందంగా ఉండే ఫౌండేషన్‌కి బదులు టింటెడ్ మాయిశ్చరైజర్ని ఎంచుకోవాలి. ముఖ్యంగా ముక్కు, చెంపలు, నుదురు వంటి చోట్ల తక్కువగా రాసి... తడి స్పాంజ్‌తో బ్లెండ్ చేయాలి. తర్వాత కళ్లకింద కన్సీలర్ కొద్దిగా రాసి అంతటా పరవాలి. ఆపై కళ్లకు సన్నగా ఐలైనర్ గీయండి. ఐషాడోగా న్యూడ్, లైట్ బ్రౌన్షేడ్లను వేస్తే కళ్లంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. చివరిగా బుగ్గలపై పీచ్ బ్లష్, పెదాలకు న్యూడ్, పింక్, కోరల్ లిప్స్టిక్ లు వేస్తే చాలు. సింపుల్గా, సహజంగా మెరిసిపోతారు.

## మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



రాయచోటి జులై 23 ప్రభాతవార్త : మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ పి.రమణారెడ్డికి మున్సిపల్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయచోటి మున్సిపాలిటీ నందు పిహెచ్ వర్కర్లుగా పనిచేస్తూ మరణించిన వారి కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు ఇవ్వాలని, డ్రైవర్లకు జీవో నెంబర్ 36 ప్రకారం అమలు చేయాలని కోరారు. ఈ విషయమై అనేకమార్లు తమ దృష్టికి తీసుకు వచ్చిన ఫలితం లేదని వారు అన్నారు. ఇక నుంచైనా పైన తెలిపిన విషయములు పరిష్కారం కాకపోతే ఆగస్టు ఒకటి నుండి నిరవధిక ఆందోళన చేస్తామని వారు తెలిపారు. వారి డిమాండ్స్ వాహనాల మరమ్మతులు చేయించాలి, సకాలంలో పనిముట్లు ఇవ్వాలి, కార్మికులకు కొబ్బరి నూనె, మాస్కులు, మొదలగునవి ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, హైకోర్టు ఆదేశాల మేరకు శాశ్వత పరిష్కారం ఉన్నవారికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ 1972 యాక్టు చట్టం ప్రకారం అమలు చేయాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని వారు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని కోరారు.

## ఆర్టీసీ కార్గో ఆదాయాన్ని పెంచాలి



పీలేరు. జూలై 23, ప్రభాతవార్త: ఆర్టీసీ కార్గో ఆదాయాన్ని పెంచాలని జిల్లా కార్గో అధికారి శరత్ బాబు అన్నారు. గురువారం ఆయన పీలేరు కార్గో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో నెలకు మదనపల్లె కార్గో ద్వారా రూ. 8 లక్షలు. రాయచోటిలో రూ. 6 లక్షలు వస్తుండగా పీలేరులో రూ. 2లక్షలు మాత్రమే వస్తోందని తెలిపారు. ఆదాయం పెంచేందుకు సిబ్బంది చురుగ్గా పని చేయాలన్నారు. జిల్లాలో కలకడ. చిన్నమండెంలో రెండు కార్గో సెంటర్లు ఖాళీలు ఉన్నాయని. ఆసక్తిగలవారు సెంటర్ల నిర్వహణకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తక్కువ సమయంలో మీ వస్తువులను ఆర్టీసీ కార్గో ద్వారా సురక్షితంగా అందించడం జరుగుతుందన్నారు. కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పూలంగల్ సర్కిల్‌లో విస్తృత వాహన తనిఖీలు

### వాహన పత్రాలు, లైసెన్సులు తప్పనిసరి ట్రాఫిక్ సీఐ ప్రసాద్‌రావు



పులివెందుల జూలై 23 ప్రభాతవార్త : వాహనచోదకులు మద్యం తాగి వాహనాలు నడపరాదు అని తమ వాహనాలకు సంబంధిత అన్ని పత్రాలు, నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ జి. ప్రసాద్‌రావు సూచిం చారు. జిల్లా ఎస్పీ సచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు డీఎస్పీ మురళి నాయక్ సూచనలతో గురువారం పట్టణంలోని పూలంగల్ సర్కిల్ వద్ద నిర్వహిం చిన ప్రత్యేక వాహన తనిఖీల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా సీఐ ప్రసాద్‌రావు మాట్లా డుతూ, ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టి ఫికెట్, బీమా తదితర రికార్డు లను వెంట ఉంచుకోవాలని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని , నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడింగ్‌తో వాహనాలు నడపరాదని హెచ్చరించారు.తనిఖీల సమయం లో నిబంధనలు ఉల్లంఘించిన ఓవర్‌లోడింగ్ వాహనాలను గుర్తించి జరిమానాలు విధించినట్లు తెలి పారు. వాహనాల నంబర్ ప్లేట్లు, పత్రాలు, భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిం చారు.ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యమని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సీఐ పేర్కొన్నారు. వాహనదారులందరూ ట్రాఫిక్ నియమాలను పాటించి పోలీ సులకు సహకరించాలని ఆయన కోరారు.

## రైతు సేవాకేంద్రాలకు చేరుతున్న యూరియా

చౌడేపల్లి, జూలై 23, ప్రభాతవార్త: మండలంలోని ఆర్ఎస్‌కేలకు యూరి యా బస్తాలు చేరుతున్నాయి. ఖరీఫ్ కా లానికిగాను మండలానికి యూరియాను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని వ్యవ యాసాయాధికారి మోహన్‌కుమార్ తెలి పారు. మండలంలోని 12ఆర్‌బికేలకు కేంద్రానికి 13క్వింటాళ్ళ చొప్పున యూ రియా మంజూరైందన్నారు. రైతులు ముందుగానే పంటల నమోదు చేసుకొని వుండాలనీ, లేకపోతే అప్పటికప్పుడే నమోదు చేసుకొని తగు మోతాదులో యూరియాను తీసుకెళ్ళాలన్నారు. పాసుపుస్తకంతోపాటు లింకయిన ఫోన్‌నంబరు ను తీసుకొని రైతుసేవాకేంద్రాల్లో సంప్రదించాలన్నారు.



## ఆరోగ్యకరమైన వాతావరణం అందించడమే లక్ష్యం


పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

చౌడేపల్లి, జూలై 23, ప్రభాతవార్త: ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యసే వలతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణమందించడమే లక్ష్యంగా పనిచేస్తు న్నామని వైద్యాధికారిణి మోనా అన్నారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. పరిశుభ్రమైన వాతావరణముంటే వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆవరణంలో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పరామర్శ

### అండగా ఉంటామని భరోసా



బద్వేల్, జూలై 23, ప్రభాతవార్త బద్వేల్ నియోజకవర్గం అనంతరాజుపురం పంచాయతీ తిమ్మరాజు పల్లెకు చెందిన తెలుగు దేశం పార్టీ కార్యకర్త దుర్వాసుల వీరమరాజు దీర్ఘకాలిక మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న విష యం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కె. విజయమ్మ గురువారం ఆయన నివా సానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పడంతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు..ఈ కార్యక్రమంలో బద్వేల్ మండల సొసైటీ అధ్యక్షుడు మన్యం రామ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బైసాని ప్రతాప్‌రెడ్డి, రైల్వే కాంట్రాక్టర్ మేరెడ్డి శ్రీని వాసులురెడ్డి, మాజీ ఎంపీటీసీ జయరాములు, రామరాజు, కుమార్, శ్రీనివా సరాజు, సుబ్బరాజు, వెంకటసుబ్బరాజు, ఎలక్ట్రి కల్ వెంకటసుబ్బారెడ్డి, డీలర్ శ్రీనివాసులు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు పేరయ్యతో పాటు శీను, మాదిగ రవి, చిన్నయ్య, రమణ, వెంకటసుబ్బయ్య, ఈగ సుబ్బారెడ్డి, మెకానిక్ వెంక టసుబ్బారెడ్డి, అనుగుంది శివకుమార్, పొన్న రాజేష్, సిద్ద మూర్తి, మహేశ్వర్‌రెడ్డి, బిజివేముల విజయ్‌రెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సూఫీ గురువు ఉరుసు ఉత్సవం



పీలేరు, జూలై 23, ప్రభాతవార్త: నియోజకవర్గంలోని కలికిరి మండలం మహల్ లోని సూఫీ గురువు హజ్రత్ సయ్యద్ మహమూద్ బుఖారి సాహెబ్ వారి ఉరుసు ఉత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. ఉత్సవంలో భాగంగా మసీదు ఆవరణంలోని దర్గాలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు, ధార్మిక ప్రసంగాలు, భక్తి గీతాలాపన తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ధార్మిక గురువులు మాట్లాడుతూ సూఫీ గురువు హజ్రత్ సయ్యద్ మహమూద్ బాషా బుఖారి సాహెబ్ వారి ధార్మిక సేవలు, ఆదర్శ జీవన విధానాన్ని కొనియాడారు. కార్యక్రమానికి హాజరైన అతిథులను శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన గురువులు ముఫ్తీ షరీఫుర్ రెహమాన్ సాహెబ్, మౌలానా ముఖీమ్ అహ్మద్ రిజ్వి సాహెబ్, తిరుపతికి చెందిన సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి సాహెబ్, డాక్టర్ సయ్యద్ జమాలుల్లా బాష బుఖారి సాహెబ్, డాక్టర్ సయ్యద్ రియాజ్ బుఖారి సాహెబ్, సయ్యద్ ఫయాజ్ బుఖారి సాహెబ్, సయ్యద్ మహమ్మదుల్లా బుఖారి సాహెబ్, నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆలయ స్థల వివాదం పరిష్కరించాలని తహశీల్దార్‌కు వినతి



రామసముద్రం,జులై 23 ప్రభాతవార్త రామసముద్రం మండలం, అరికెల గ్రామ పంచాయతీ, చింతమాకులపల్లి గ్రామంలో పూర్వం నుండి గ్రామ దేవత గంగమ్మ గుడి వున్నదని,ఆ గుడి శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామ ప్రజలందరూ నూతనంగా గుడి నిర్మాణం చేపట్టి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేయు సందర్భంగా 2సంవత్సరాల నుండి వి. పార్వతమ్మ,చిన్న నారాయణప్ప,మసెప్ప అను ముగ్గురు గుడికి అనుకోని ఇటుకలు పెట్టినారని వాటిని తొలగించినందుకు వారు గొడవలు చేస్తున్నారని కావున గ్రామ సర్వే నెంబర్ 273 ను సర్వే చేసి ఆలయ అభివృద్ధికి తగు న్యాయం చేయాలని గ్రామస్థులు గురువారం తాహశీల్దార్ కు వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిసి చైతన్య సమితి సమావేశంను జయప్రదం చేయండి



బ్రహ్మంగారి మఠం, జులై 23,ప్రభాతవార్త జాతీయ బిసి చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బిసి రమణ ఆధ్వర్యంలో జరుగుతున్న బిసి చైతన్య సమితి కమిటీ ఏర్పాటుకు జరుగుతున్న సమావేశంలో బ్రహ్మంగారిమఠం మండలంలోని బిసి కులాల నాయకులు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని బిసి పెద్దలు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ ఆదివారం బ్రహ్మంగారిమఠంలోని పట్రా నాయుళ్ల కళ్యాణ మండపంలో ఉదయం 9.15 గం లకు సమావేశం ప్రారంభమవుతుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో బ్రహ్మంగారిమఠం చైతన్య సమితి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షులు బీసీ రమణ మరియు జిల్లా నాయకులు పాల్గొంటారని వారు తెలిపారు. కాబట్టి బ్రహ్మంగారిమఠం మండలంలోని అన్ని బిసి కులాల ప్రజలు రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని వారు కోరారు.

# రూ.50 లక్షల సీసీ రోడ్డు మధ్యలో భారీ గుంత

### భాకరాపురం ప్రజలకు తప్పని అవస్థలు .. అధికారుల నిరక్షయ్యంపై ఆగ్రహం

### గుంతను పూడ్చి ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థానికుల డిమాండ్



పులివెందుల జూలై 23 ప్రభాత వార్త : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని భాకరాపురంలో ఉన్న త్రిలోక్ సూపర్ మార్కెట్ ప్రాంతంలో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. వర్షాలు కురిసిన పుడు సిమెంట్ రోడ్డు లేకపోవడంతో రహదారిపై వర్షపు నీరు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, అధికారులు మారుతున్నా తమ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వారు వాపోతున్నారు. ఇటీవల ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో సుమారు రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే రహదారి మధ్యలో ఉన్న సర్కిల్ ప్రాంతంలో సుమారు 10 మూరల పొడవున ఉన్న గుంతను మాత్రం పూడ్చకుండా వదిలేయడం పట్ల ప్రమాదాలకు నెలవుగా మారింది. పూడ్చకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసిన సమయంలో గుంతలో నీరు నిలిచిపోవడంతో అది కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురియై గాయాల పాలు అవుతున్నారు అని ప్రతిరోజు సాయంత్రం పూట అటువైపు వెళ్లే వాహనాలు గుంత ఉండడం అంచనా లేక బోల్తా కొడుతున్నాయి. బుధవారం సాయంత్రం పూట కూడా చిన్నపాటి వర్షానికి గుంత నిండడంతో ఆటో బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయనీ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటికీ, మధ్యలో ఉన్న గుంతను పూడ్చకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు విమర్శిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి గుంతను పూడ్చి, రహదారిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, ప్రజల ప్రాణాలను కాపాడాలని భాకరాపురం స్థానికులు కోరుతున్నారు.


**IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE, KADAPA**

**T.O.P. No. 7/2025**

Lanka Ravi, S/o Purusotham, R/o D.No.25/35, Vasanthapeta, Proddatur Town and Mandal, Kadapa Dist. **- Petitioner**

Vs

1) Koruguntlapalli Jaker Hussain, S/o K.Basha died his LRs are No 2 to 4
2) K.Khadirun, W/o Late Jakeer Hussain, aged 52 years,
3) K.Karishma, D/o Late Jakeer Hussain, aged 35 years,
4) K.Iqbal, S/o Late Jakeer Hussain, aged about 32 years,
All are Residing D.No: 2/1049, Ice Factory Street, Nagarajupeta, Kadapa City, Y.S.R. Kadapa Dist.
5) S.Mahaboob Basha, S/o S.Nooran Saheb, aged about 65 years, R/o D.No. Vasanthapeta, Proddatur Town, Y.S.R. Kadapa Dist.
6) K Jubeda, W/o late Khadim Sa, aged 59 years, R/o D.No. 20/535-1, back side of D.No.25/535, near LIC Office, Proddatur Town, Y.S.R. Kadapa Dist.
7) Khadar Basha @ Jalali, S/o Late Khadim Sa, aged 43 years, R/o D.No. 20/535-1, back side of the D.No.25/535, Near LIC Office, Proddatur Town, Y.S.R Kadapa Dist. **- Respondents**

**నోటీసు**

పై దావాలో పై పేర్కొన్న పిటీషనర్, రెస్పాండెంట్ల పైన (No.2 to 7) పై పేర్కొన్న కోర్టులో ప్రొద్దుటూరు రాజశ్రీ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో ఉన్న దావా నెం. 219/2017ను ప్రొద్దుటూరు రాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో ఉన్న దావా నెం. 352/2016 లోనికి ట్రాన్స్‌ఫర్ చేయుటకు గాను పిటీషన్ వేసి ఉంటున్నారు. పై దావాలో 11.08.2026వ తేదీన ఉదయం 10.30 గం॥లకు పేర్కొన్న కోర్టులో ప్రతివాదులైన మీయొక్క హాజరుకు వాయిదా ఉంటూ ఉన్నది. కావున సదరు తేదీన పై పేర్కొన్న కోర్టులో పై పేర్కొన్న సమయమున మీరు స్వయంగా గాని లేదా మీ న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనంతట మీ పరోక్షముగా తీర్మానించబడును.

**దద్దనాల ప్రవీణ్,** B.A., B.L., Advocate, Cell: 9866936750

## అదనపు తరగతి గదులు, డార్మిటరీ, డైనింగ్ హాల్, ప్రహరీ నిర్మాణానికి చర్యలు



**పీలేరు జూలై 23 (ప్రభాతవార్త):**
నియోజకవర్గంలోని కలికిరిలోని మహాత్మా గాంధీ జ్యోతీబా పూలే బాలికల బీసీ రెసిడెన్షియల్ పాఠశాలను ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో విద్యార్థినులకు అవసరమైన అదనపు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డితో కలిసి కలికిరిలోని మహాత్మా గాంధీ జ్యోతీబా పూలే బాలికల బీసీ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, వసతి సదుపాయాలు, ఇతర మౌలిక వసతులను వారు పరిశీలించారు. ప్రస్తుతం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కొనసాగుతున్న ఈ పాఠశాలను 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో భాగంగా ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించనున్నారు. ఒక్కో కోర్సులో 80 మంది చొప్పున విద్యార్థినులకు అవకాశం కల్పించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థినులకు అవసరమైన అదనపు తరగతి గదులు, డార్మిటరీ సదుపాయాలను కల్పించేందుకు పాఠశాల సమీపంలోని సీఆర్సీ భవనాన్ని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే సొసైటీ ద్వారా రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయని, అవసరాన్ని బట్టి అదనపు నిధులను కూడా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా పాఠశాల వెనుక భాగంలో ఉన్న సుమారు ఒక ఎకరం స్థలానికి ప్రహరీ నిర్మాణం, విద్యార్థినుల కోసం డైనింగ్ హాల్ ఏర్పాటు, పాఠశాల ముందు భాగంలోని ప్రహరీని మరింత ఎత్తు పెంచే పనులకు అవసరమైన అంచనాలను సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్, ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన వసతి, భోజనం, సురక్షితమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్య ప్రారంభానికి ముందే అవసరమైన మౌలిక సదుపాయాల పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూఐడిసి ఈఈ కరీముల్లా ఖాన్, పాఠశాల ప్రిన్సిపాల్, తాసిల్దార్, మార్కెట్ కమిటీ చైర్మన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీపేటలో "భేటిబచావో, భేటి పడావో "

**చాపాడు. జూలై 23 (ప్రభాతవార్త :**
మండలంలోని లక్ష్మీపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల యందు గురువారం స్త్రీ మరియు శిశు సంక్షేమ సాధికారత ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటి పడావో కార్యక్రమం నిర్వహించినట్లు అల్లాడుపల్లె సెక్టార్ సూపర్వైజర్ విజయేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా బాలికలకు రక్షణతోపాటు, చదువుకల్పించాలని పలువురు తెలిపారు. అదేవిధంగా పిల్లలకు బాల సహాయవాణి 1098 నెంబర్ అందిస్తున్న సేవలు మరియు మిషన్ వాత్సల్య, బాలల హక్కుల చట్టాలపై అవగాహన అనంతరం ఐసిడిఎస్ అందిస్తున్న సేవలు వన్ స్టాప్ సెంటర్ ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181 గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మీపేట ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యం



**ప్రొద్దుటూరు అర్బన్, జూలై 23 (ప్రభాతవార్త)**
ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి. డోర్ టూ డోర్ కార్యక్రమంపై గురువారం భారత్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ శ్రేణులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయంతో ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకురాలు కొండవీటి భావన, పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారీ జాకీర్, జనసేన, బీజేపీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉన్నత చదువులతో
## భవిష్యత్‌కి బాటలు వేయాలి



**వేంపల్లె జూలై 23 (ప్రభాతవార్త)**
ఉన్నత చదువుల ద్వారా భవిష్యత్తుకి బాటలు వేసుకోవాలని ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జి.విజయ ప్రకాష్ సూచించారు. గురువారం ఆర్కేవ్యాలి, ఒంగోలు క్యాంపస్ లకు సంబంధించి మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి అయింది. ఈ సందర్భంగా ఒంగోలు క్యాంపస్ మిగిలిన 246 సీట్లకు 161, ఆర్కేవ్యాలి క్యాంపస్ మిగిలిన 82 సీట్లకు 52 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మిగిలిన సీట్లకు గాను నాలుగో విడత కౌన్సిలింగ్ లో పూర్తి చేస్తారని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్కేవ్యాలి పరిపాలన అధికారి డా.రవికుమార్, అకాడమిక్ డీన్ డా రమేష్ కైలాస్, రూపస్, స్టూడెంట్ వెల్ఫేర్ వెంకటేష్, అసోసియేట్ డీన్లు రాఘవరెడ్డి, నవీన్, ఉదయశ్రీ, హాస్పిటల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. దీప్తి, పిఆర్ఓ డా.తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హామీలను నిలబెట్టుకొన్న ప్రభుత్వం : ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**మదనపల్లె, జూలై 23 (ప్రభాతవార్త :**
ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకొందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం పట్టణంలోని బైపాస్‌రోడ్డు ఓ ప్రైవేటు పంక్షన్‌హాలులో తెలుగుతమ్ముళ్ళకు ఇచ్చిన పార్టీ కమిటీ పదవులకు సంబంధించి ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే ద్వారా పదవులు పొందిన వారు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరిశీలకులు నెట్టెం వెంకటేష్, ఎమ్మెల్యే షాజహాన్‌భాషాలు పాల్గొన్నారు. నియోజకవర్గ నలుమూలల నుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన మహిళలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం రెండు రోజుల క్రితం తల్లికివందనం పథకం పేరుతో తల్లుల ఖాతాల్లో రూ.15వేలు జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదివేల మంది తల్లులకు రూ.350కోట్లు తల్లుల అకౌంట్లలో జమ చేశారన్నారు. ఇక నియోజకవర్గంలో కూడా అభివృద్ధి పనులు పెద్దఎత్తున చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజ్ పనులు చేపట్టడం జరిగిందన్నారు. నీటి ఎద్దడి నివారణకు కూడా కొత్తగా బోర్లు డ్రిల్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పచ్చిపాల తులసి, అధ్యక్షులు అరుణ్‌తేజ్, శ్రీనివాసులు, రాధ, రాజన్న, విజయగౌడ్, గుర్రప్పనాయుడు, నాయకులు రఘుపతినాయుడు, ఎరబల్లి వెంకటరమణారెడ్డి, నందకుమార్,నవీన్‌చౌదరి, ఆర్ఎస్.షంషీర్, నీలకంఠ, సిద్దప్ప, కమలామ్రక్రిష్ణా, పులిమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం నిర్వహిస్తున్న దృశ్యం

## మాత శిశు సంరక్షణ సేవలపై తనిఖీ



**బ్రహ్మంగారిమఠం జూలై 23 ప్రభాతవార్త**
మండలంలో పలుగురాళ్లపల్లె పీహెచ్సీలో గర్భిణీలకు, బాలింతలకు అందుతున్న మాత శిశు సంరక్షణ సేవలపై జిల్లా స్టాటికల్ అధికారి ఏ.రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించడం జరిగింది. రక్తహీనత ఉన్న గర్భిణీలు, వ్యాధి నిరోధక టీకాలు,యుక్త వయసులో ఉన్న బాలికల రక్తహీనత మొదలగు సేవలపై ఈ బృందం తనిఖీ చేయడం జరిగింది.అలాగే ఆర్ సి హెచ్ పోర్టల్, ఏంసిపి కార్డులు,ఆర్ సి హెచ్ 2.0 రిజిస్టర్,పుట్టింటికి వచ్చిన గర్భవతులు మొదలు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది. మరియు గర్భవతులకు కిషోర్ బాలికలకు రక్తపరీక్షలు చేసి హిమోగ్లోబిన్ శాతాన్ని సరిచూశారు. ప్రతి గర్భిణీకి 12 వారాలలోపు నమోదు చేసి రెండు డోసులు టీడీ వ్యాక్సిన్, 180 ఐరన్ ఫోలిక్ మాత్రలు,360 క్యాల్షియం మాత్రలు మింగించాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు పూర్తి వ్యాధి నిరోధక టీకాలు వేయాలని,ప్రతి ప్రసవము ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరగాలని వారు సూచించారు. అలాగే పిఎంఎం వివై,పి ఎం ఎస్ ఎంఏ,జె ఎస్ వై, జె ఎస్ ఎస్ కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మెడికల్ ఆఫీసర్స్ ఝాన్సీ,డాక్టర్ భాను శ్రీ, డిపిఓ, హెచ్ ఎంఐఎస్ అధికారి,ఎంపిహెచ్ఈ ఓ సూపర్వైజరలు, ఎంఎల్ హెచ్‌పిలు, ఏఎన్ఎం లు,ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఆత్మీయ సమావేశం



**సుండుపల్లి, జూలై 23, (ప్రభాతవార్త :**
పట్టణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా సీనియర్ పార్టీ నాయకులు జనసేన శ్రేణులు సానుభూతిపరులు మద్దతుదారులు అందరూ కలిసి క్షేత్ర స్థాయిలో జనసేపార్టీ బలోపేతం లక్ష్యంగా పని చేయాలని జనసేన నేత రామాశ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సిద్ధాంతాలకు అనుగుణంగా ఆయన ఉప ముఖ్యమంత్రిగా మరియు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి తదితర శాఖల ద్వారా ఆయన చేస్తున్నటువంటి పరిపాలన విధానాన్ని ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తెలియపరచాలని అదేవిధంగా ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంట్ స్థాయిలో గ్రామపంచాయతీ మండలాల వారిగా నియోజకవర్గాల లోకసభ స్థానాలలో దరఖాస్తులు చేసుకున్న వారికి ఆగస్టు 15 తారీకు లోపు అన్ని స్థాయిలలో నూతనంగా కమిటీలు పూర్తి అవుతాయని పార్టీని బూతు స్థాయిలో అభివృద్ధి చేయడానికి మంచి అవకాశంగా భావిస్తూ ఉత్సాహవంతలకు పార్టీలో చేరడానికి అవకాశం కల్పిస్తామని రానున్న స్థానిక ఎలక్షన్లలో ఆశావాహులందరూ సమాయత్తం అవ్వాలని పిలుపునిచ్చారు. అలాగే మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో ఏ సమస్య ఉన్న పార్టీ దృష్టికి తీసుకొస్తే సకాలంలో సమస్యల పట్ల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సమాచార సేకరణ కమిటీ మెంబర్ రెడ్డిరాణి, జగిలి ఓబులేష్, మంగిరి రమణయ్య, శ్రీనివాసరాజు, అన్నయ్యగారి రవీంద్ర, ఒంటేరు రాజగోపాల్ పాల్గొన్నారు.

## బీటెక్ రవి మాటలు ప్రజాస్వామ్యానికి అవమానం

**పులివెందుల, జూలై 23, (ప్రభాతవార్త :**
తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి అవమానం అని, పోలీసుల అండతో గెలుస్తామనడం ప్రజాస్వామ్యానికి ద్రోహం చేసినట్టు అని జెడ్పీటీసీ తరహా అక్రమాలు మున్సిపల్ ఎన్నికల్లో సాగవు అని పులివెందుల ఓట్లపై కన్నేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘాటుగా విమర్శించారు. గురువారం స్థానిక వైసీపీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ సివిల్ సప్లై డైరెక్టర్ పట్టణ అధ్యక్షులు హాల్ గంగాధర్ రెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప, నూరు బాషా సంఘం నాయకులు రసూల్ వేముల ,సింహాద్రిపురం మండల కన్వీనర్లు నాగెల్ల సాంబాశివారెడ్డి, దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిలు మాట్లాడుతూ బిటెక్ రవి మాటలు ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేసే విధంగా ఉన్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలవాలని, అధికార వ్యవస్థను అడ్డుపెట్టుకొని ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడతామని చెప్పడం బాధ్యతారాహిత్యమన్నారు. పులివెందుల నియోజకవర్గంలోని పలు మండలాల్లో అవినీతి, అక్రమ సంపాదనకు సంబంధించిన ఆరోపణలు ఉన్నప్పటికీ, వాటిపై సమాధానం చెప్పకుండా కార్యకర్తల ముందు సానుభూతి కోసం మాట్లాడటం సరికాదని విమర్శించారు. వందల కోట్ల రూపాయల అక్రమ సంపాదనకు సంబంధించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో పదవులు ఇస్తామని హామీలు ఇవ్వడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. టీడీపీ కార్యకర్తలు కూడా నాయకత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో జరిగినట్లు పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల ఓట్లను దోపిడీ చేయడం సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు. ఇకనైనా ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, ప్రజల తీర్పుతో గెలవాలని బీటెక్ రవికి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ హాఫీజ్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, రాష్ట్ర బూత్ కమిటీ నాయకుడు చంద్రమోళి , ఆనంద రెడ్డి తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

## రికార్డులను పరిశీలించిన డిఎల్‌పిఓ



**దువ్వూరు, జూలై 23, (ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరు గ్రామ పంచాయతీ రికార్డులను జమ్మలమడుగు డి.ఎల్.పి.ఓ నూర్జహాన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఆదాయ వనరులు, పారిశుధ్యం, పరిశుభ్రత తదితర వాటిపై ఈవోపిఆర్డి హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మిలతో చర్చించారు. అనంతరం గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయానికి సంబంధించిన రికార్డులను అలాగే జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఇంటి, నీటి పన్ను వసూళ్ల రికార్డులను పరిశీలించారు. పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో ఎవరైనా ఇల్లు నిర్మించుకోవాలంటే తప్పనిసరిగా ప్లాన్ అప్రూవల్ చేసుకోవలసి ఉంటుందని ఆ విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## యర్రగుంట్ల స్టేషన్‌ను అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేయాలి

**పులివెందుల, జూలై 23, (ప్రభాతవార్త:**



కడప జిల్లాలో రైల్వే అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా యర్రగుంట్ల రైల్వే స్టేషన్‌ను 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' కింద అభివృద్ధి చేయాలని ఎంపీ కోరారు. యర్రగుంట్ల పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రైల్వే స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడం ద్వారా ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపా రు. అలాగే కడప రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రెండు షిఫ్టుల్లో రిజర్వేషన్ కౌంటర్‌ను నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం రిజర్వేషన్ సేవల విషయంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు ఈ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విధంగా కడప జిల్లాలోని పలు రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని రైళ్లకు నిలుపుదల కల్పించాలని ఎంపీ అవినాష్ రెడ్డి కోరారు. రైల్వే అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను తన లేఖల ద్వారా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జిల్లా ప్రజల రవాణా అవసరాలను తీర్చేందుకు రైల్వే సౌకర్యాల విస్తరణ, స్టేషన్ల ఆధునీకరణ, మరిన్ని రైళ్ల నిలుపుదల ఎంతో అవసరమని ఎంపీ పేర్కొన్నారు.

## ప్రతిష్టాత్మకంగా 40 రోజులపాటు ఇంటింటికి తెలుగుదేశం శ్రేణులు

**రాజంపేట, జూలై 23 (ప్రభాతవార్త**
కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా ప్రజలకు ఏమి చేసామో చెప్పి, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ఫలాలు ప్రజలకు తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉందని 40రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు పిలుపునిచ్చారు. పార్టీ కుటుంబ సభ్యులంతా ఈనెల 27 నుంచి 40 రోజులపాటు ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేసిన విషయాన్ని వివరించాలన్నారు. గురువారం స్థానిక ఎన్ కే ఎన్ కళ్యాణ మండపంలో టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో జరిగింది. నియోజకవర్గ పరిశీలకులు భీమినేని చిట్టిబాబు తో కలిసి పార్టీ నాయకులకు ,కార్యకర్తలకు చమర్తి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ఈ కార్యక్రమం పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమైనదని పేర్కొన్నారు. పార్టీలో ఏ స్థాయిలో ఉన్నా వారైనా ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని ప్రతి ఇంటిని సందర్శించాలని సూచించారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందించిన సేవలను ఇంటింటికి వివరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను,ప్రభుత్వం నెరవేర్చిన విషయాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పని చేయాలని ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను మరింత బలోపేతం చేయాలని కోరారు .ప్రజల సమస్యలను,సూచనలను నమోదు చేసి పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని జగన్‌మోహన్‌రాజు సూచించారు. రాజంపేట నియోజకవర్గ పరిశీలకులు భీమినేని చిట్టిబాబు మాట్లాడుతూ పార్టీ అనుమతి లేకుండా సమావేశాలు పెడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పార్టీ విషయాలు సోషల్ మీడియాలో పోస్ట్ చేసినా అధిష్టానం ఉపేక్షించదని చెప్పారు.పార్టీకి వ్యతిరేకంగా, నియోజకవర్గ ఇన్చార్జి కు వ్యతిరేకంగా పార్టీ మీటింగులు పెట్టడం, సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం మానుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేత ఎద్దుల సుబ్బరాయుడు, డాక్టర్ సుధాకర్, మండల కమిటీ అధ్యక్షులు మేడికొండ రవికుమార్, దగ్గుపాటి మణి, భానుగోపాల్ రాజు, జంగం శెట్టి సుబ్బయ్య, గుల్జార్ భాష, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర హాకీలో పులివెందుల జోరు

**పులివెందుల, జూలై 23 , (ప్రభాతవార్త :**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరులో జూలై 19 నుంచి 22 వరకు నిర్వహించిన 16వ జూనియర్ పురుషుల రాష్ట్ర హాకీ ఛాంపియన్‌షిప్‌లో పులివెందుల హాకీ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి కడప జిల్లా జట్టుకు రజత పతకం సాధించారు. కడప జిల్లా తరఫున పోటీల్లో పాల్గొన్న పులివెందుల క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకుని రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించడం పట్ల ఖేలో ఇండియా హాకీ సెంటర్, పులివెందుల కోచ్ ఈ. రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారుల క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన క్రీడాకారులతో పాటు వారికి శిక్షణ అందించిన కోచ్‌లను, పోటీలకు అన్ని విధాలుగా సహకరించిన వారిని కడప జిల్లా క్రీడాభివృద్ధి అధికారి గౌస్ హృదయపూర్వకంగా అభినందించారు. క్రీడాకారులు ఇదే పట్టుదలతో సాధన కొనసాగించి భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించి కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురా వాలని ఆయన ఆకాంక్షించారు. పులివెందుల హాకీ చరిత్రలో ఈ రజత పతకం మరో మైలురాయిగా నిలిచిందని క్రీడాభిమానులు పేర్కొన్నారు. భవిష్యత్తులో పులివెందుల నుంచి మరింత మంది ప్రతిభావంతులైన హాకీ క్రీడాకారులు వెలుగులోకి రావాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



## పనులను పరిశీలించిన డిఈ

**దువ్వూరు, జూలై 23, (ప్రభాతవార్త:**



మండల పరిధిలోని కేసీ కాలువ పరిధిలో జరుగుతున్న వివిధ రకాల పనులను కేసీ కెనాల్ డీఈ పుల్లయ్య గురువారం పరిశీలించారు. ఇడమడక, దువ్వూరు అలాగే కామనూరు కాలువల పరిధిలో జరుగుతున్న వివిధ రకాల పనులను పరిశీలించి అక్కడ అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాలు వచ్చినా రాకపోయినా కేసి కాలువ పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే ఇడమడక 11 కమాన్ల వద్ద సైడ్ గోడ నిర్మాణం పూర్తయింది అన్నారు. అలాగే మిగతా పనులు కూడా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మహా పాదయాత్ర

**బద్వేలు, జూలై 23, (ప్రభాతవార్త**



లోక కళ్యాణార్థం కోసం గోపవరం మండలం వల్లెరవారి పల్లెలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుండి పెంచలకోన శ్రీ పెనుశీల లక్ష్మీనరసింహా స్వామి క్షేత్రం వరకు నిర్వహించిన మహా పాదయాత్ర గురువారంతో ముగిసింది. ఈ మహా పాదయాత్రలో వృద్ధులు, మహిళలు భారీగా తరలిరావడం ఆనందం అభినందనీయమని పెంచలయ్య స్వామి పేర్కొన్నారు. . ఆషాడ మాసం స్వాతి నక్షత్రం రోజున లక్ష్మీ నరసింహా స్వామిని దర్శించుకోవడం ఎంతో శుభప్రదాయమని, స్వామిని దర్శించుకున్న వారికి కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకమని పెంచల స్వామి తెలిపారు. ఈ మహా పాదయాత్ర రెండవసారి నిర్వహించినప్పటికీ ఇంతటి స్పందన రావడం ఎంతో అభినందనీయ మన్నారు. అలాగే పెంచలయ్య అనే ఓ భక్తుడు భక్తులందరికీ భోజన సదుపాయం కల్పించడం జరిగింది. ఈ మహా పాదయాత్రకు సహకరించిన మీడియా మిత్రులు, ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## 11వ బెటాలియన్‌లో వార్షిక తనిఖీ

**సిద్ధవటం జూలై 23 (ప్రభాతవార్త**



11వ పోలీస్ బెటాలియన్, భాకరాపేట నందు డి. ఉదయ భాస్కర్, డీఐజీ 2 ఏపీఎస్పీ బెటాలియన్ కర్నూల్ వార్షిక తనిఖీ నిర్వహించారు. వార్షిక తనిఖీలో భాగంగా బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ మరియు చిన్న పరేడ్ గ్రౌండ్లో నిర్మించనున్న నూతన షెడ్కు సంబంధించిన శిలాఫలకాలను డిఐజి ప్రారంభించారు. అనంతరం బెటాలియన్ తనిఖీ చేసిన బెటాలియన్ నందు మహిళల కోసం నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ అండ్ ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు ను తమ సతీమణి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ కె. ఆనందారెడ్డి తల్లి మరియు సతీమణి కూడా పాల్గొన్నారు. అనంతరం బెటాలియన్ నందు ఆఫీసులు, స్టోర్లు, యూనిట్ హాస్పిటల్, ఆయుధాగారం తదితర విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలోకె. ఆనందారెడ్డి, కమాండెంట్, పి.ఎన్.డి. ప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్, శ్రీ పి. రాజశేఖర్, అసిస్టెంట్ కమాండెంట్, కె. వెంకటప్ప, డీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు మరియు బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

## పెన్ డౌన్ సమ్మెకు సంఘీభావం

**వేంపల్లె జూలై 23 (ప్రభాతవార్త**
దస్తావేజుల లేఖరుల నిరవధిక పెన్ డౌన్ సమ్మెకు సంఘీభావంగా మద్దతు తెలిపినట్లు విశ్రాంత హెచ్ఎం నరసింహారెడ్డి వెల్లడించారు. గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద చేపట్టిన ఆ సమ్మెకు విశ్రాంత హెచ్ఎం నరసింహారెడ్డి, మాజీ కోఆప్సన్ సాదక్ వలి, సుబ్బారావు, రఘునాథ్ రెడ్డి, కొత్తూరు రెడ్డయ్యలు మద్దతుగా నిలిచారు. ఇటివల ప్రభుత్వం తెచ్చిన జీఓ 396ని రద్దు చేయాలని కోరుతూ దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, డిటిపి ఆపరేటర్లు పెన్ డౌన్ సమ్మె ప్రకటించారు. వేలాది మంది దస్తావేజు లేఖరులు, డిటిపి ఆపరేటర్ల జీవనోపాధిని కోల్పోయి రోడ్డున పడే అవకాశం ఉందని, వీరికి ప్రభుత్వం ఆర్థిక బధ్రత కల్పిస్తూ జీఓ 396ని రద్దు చేయాలని



## గాయపడిన వ్యక్తి మృతి, గ్రామంలో విషాదఛాయలు

**నిమ్మనపల్లె, జులై 23 (ప్రభాతవార్త :**
రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. తవళం పంచాయితీ నల్లంవారిపల్లెకు చెందిన చిన్నరెడ్డప్ప కుమారుడు సూర్యనారాయణ(35) అతని భార్య రెడ్డమ్మ(32) ఈనెల 18న ద్విచక్ర వాహనంలో వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లె, ఒడ్డిపల్లెకు వెళ్ళి తిరిగి వస్తుండగా నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లె క్రాస్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరూ కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. సూర్యనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. తిరుపతిలో చికిత్సలు పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.